



# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 87,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,శుక్రవారం, తేదీ : 31-07-2026


## రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం




- రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్– ఏడుగంటల పాటు చర్చకు సమయం

ఢిల్లి : లోక్ సభలో ఆమోదం పొందిన యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పేపర్ లీకేజీ వల్ల నష్టపోయేది విద్యార్థులే అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

- వందేమాతరం అవమానాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ
- అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా విధించేలా కఠిన నిబంధనలు
- ఉభయ సభల ఆమోదంతో రాష్ట్రపతి పరిశీలనకు చేరనున్న



ఢిల్లి : జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అంతకుముందు, జూలై 29న ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. 1971 నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, మిగతా..2లో

## ఇరాన్‌కు పాకిస్థాన్ మీదుగా చైనా క్షిపణులు.. స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

- కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.
- చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకుపైగా విలువైన 400 షోల్డర్‌ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది.



ఢిల్లి : అగ్రరాజ్యం అమెరికా విమానాలు హెలికాప్టర్ల కు తలనొప్పిగా మారుతున్న కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. టి రవాణాకు పాకిస్థాన్ ను మార్గంగా ఎంచుకున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దాంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పాకిస్థాన్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తంచేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకుపైగా విలువైన 400 షోల్డర్‌ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. వాటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే ఈ డీల్‌కు మిగతా..2లో

## తెలంగాణలో భారీ వర్షాలు.. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్




- తీవ్ర వాయుగుండం నేపథ్యంలో నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది.
- ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.
- ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

హైదరాబాద్, జులై 30: తీవ్ర వాయుగుండం నేపథ్యంలో నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని

## 2034 వరకు నేనే సీఎం'.. ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

### టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం

- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ




అమరావతి: విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో మిగతా..2లో

## మహిళా, శిశు సంక్షేమ శాఖపై సీతక్క సమీక్ష.. కీలక నిర్ణయాలు



- అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
- మహిళా, శిశు సంక్షేమ శాఖపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన మంత్రి సీతక్క.
- అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకాలు, పిల్లల పోషణపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, జులై 30: అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మిగతా..2లో

## పెద్దపులి సంచారం.. ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్



తూర్పు గోదావరి జిల్లాలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపింది.

దీంతో ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు.

పెద్దపులి తూర్పు గోదావరి నుంచి ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చేరుకోవడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు..

తూర్పు గోదావరి, జులై 30: జిల్లాలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపింది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. పెద్దపులి తూర్పు గోదావరి నుంచి ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చేరుకోవడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గోపాలపురం మండలం నుంచి కొయ్యలగూడెం మండలం పరిధిలోని మంగపతిదేవిపేట, మెత్తప్పగూడెం అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా..2లో

## రెండు రోజులుగా వర్షాలు.. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే



తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

హైదరాబాద్, జులై 30: తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మిగతా..2లో

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా




- తన నివాసంపై దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోలేదని అంబటి ఆగ్రహం
- వినతి యాత్ర పేరుతో గుంటూరు నుంచి డీజీపీ కార్యాలయం వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయం
- అదే సమయంలో వైసీపీ నిరసన కార్యక్రమాలు ఉండటంతో పాదయాత్ర వాయిదా

అమరావతి: తన నివాసంపై జరిగిన దాడికి సంబంధించి నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం

## ఆ కసితోనే జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం

- రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటి వేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.
- ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.



కర్నూలు, జులై 30: రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం కర్నూలులో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. మిగతా..2లో

## సీదిరి అప్పలరాజును జగన్ పరామర్శించడంపై మంత్రుల ఆగ్రహం



- క్రిమినల్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు ఎలా ఉంటారో చెప్పేందుకు జగనే నిదర్శనమన్న కొల్లు రవీంద్ర
- నేరస్తులకు జగన్ వంతపాడుతున్నారని మండిపాటు

అమరావతి : వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ చేసిన బైక్ యాక్సిడెంట్‌లో దానయ్య అనే గొర్రెల కాపరి మృతి చెందిన కేసులో అరెస్టయిన అప్పలరాజును వైసీపీ అధినేత జగన్ పరామర్శించడంపై ఏపీ మంత్రులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఆ కసితోనే జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం

ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మూడు నెలల్లో (90 రోజుల్లో) వస్తుందని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తనను పత్తికొండలో పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారని.. కానీ ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టులు వస్తుంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనిట్‌పై రూ.13 పైసలు తగ్గించామన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు.

## పెద్దపులి సంచారం.. ఏజెన్సీ ప్రాంతంలో హై అలర్ట్

రేడియో కాలర్ సిగ్నల్స్ ఆధారంగా పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, దాని జాడ కోసం ప్రత్యేక బృందాలతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. రేడియో కాలర్ సిగ్నల్ ప్రకారం.. పులి కేవలం 100 మీటర్ల పరిధిలోనే ఉన్నట్లు గుర్తించినప్పటికీ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. వర్షం తగ్గిన వెంటనే పులి సంచారాన్ని మరింత స్పష్టంగా ట్రాక్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో ఏజెన్సీ పరిసర గ్రామాల ప్రజలను అటవీ శాఖ అప్రమత్తం చేసింది. ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పొలాల్లో ఉన్న పశువులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పులి కనిపించినా లేదా దాని అడుగుజాడలు గుర్తించినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా: అంబటి రాంబాబు

లేదని ఆరోపిస్తూ తలపెట్టిన 'వినతి యాత్ర' పాదయాత్రను మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తాత్కాలికంగా వాయిదా వేశారు. గుంటూరులోని తన నివాసంలో పార్టీ నేతలతో అత్యవసరంగా సమావేశమైన అనంతరం ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. త్వరలోనే పాదయాత్రకు సంబంధించి కొత్త తేదీని ప్రకటిస్తానని తెలిపారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... ఆగస్టు 7, 8 తేదీల్లో గుంటూరులోని తన నివాసం నుంచి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం వరకు రెండు రోజుల పాటు ఈ నిరసన పాదయాత్ర చేపట్టాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వైసీపీ అదే సమయంలో రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. పార్టీ అధిష్ఠానం చేపడుతున్న ముఖ్యమైన నిరసన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, తన సొంత పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు అంబటి స్పష్టం చేశారు.

## మహిళా, శిశు సంక్షేమ శాఖపై సీతక్క సమీక్ష..

మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## తెలంగాణలో భారీ వర్షాలు.. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తోపాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## రెండు రోజులుగా వర్షాలు.. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## ఇరాన్‌కు పాకిస్థాన్ మీదుగా చైనా క్షిపణులు.. స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టతలేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేసింది. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించబోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా చేశారు.

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం



జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది. నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానానికి ఆటంకం కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలో చర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా, వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## సీదిరి అప్పలరాజును జగన్ పరామర్శించడంపై మంత్రుల ఆగ్రహం

మొదటి పేజి తరువాయి



బాధితుడి కుటుంబాన్ని వదిలేసి, నిందితులను జగన్ పరామర్శించడం దారుణమని మంత్రులు కొల్లు రవీంద్ర, సంధ్యారాణి మండిపడ్డారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... "క్రిమినల్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు ఎలా ఉంటారో చెప్పేందుకు జగనే ప్రత్యక్ష నిదర్శనం. గతంలో అనేక ప్రమాదాల్లో బాధితులను పట్టించుకోని జగన్.. ఇప్పుడు హంతకులకు, రౌడీలకు నేరుగా క్లీన్ చిట్ ఇస్తూ నేరస్తులకు వంతపాడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని పిలుపునిచ్చారు. మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ... జగన్ వస్తున్నారంటే చనిపోయిన గౌరెల కాపరి కుటుంబాన్ని పరామర్శిస్తారేమో అని ఆశపడితే సీన్ రివర్స్ అయిందన్నారు. బాధితులను కాకుండా చంపిన వారిని పరామర్శించడమే ఆ పార్టీ నేర ప్రవృత్తికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా జగన్ తన వైఖరి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. మరోవైపు, పలాసలో జగన్ పర్యటన సందర్భంగా హైవేపైకి వైసీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ముందస్తు అనుమతులు లేకపోవడంతో జామి, దెంకాడ ప్రాంతాల వద్ద కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించి నిరసనకు దిగడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## 2034 వరకు నేనే సీఎం'.. ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

మొదటి పేజి తరువాయి

జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి" అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల




ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

## యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకం- కేంద్రం ఆ హామీలను నిలబెట్టుకుంటే సంతోషం

వందే భారత్ ప్రయాణాన్ని ప్రశంసించిన సోనమ్ వాంగ్‌చుక్- విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు పెట్టొద్దంటూ కేంద్రానికి విజ్ఞప్తి- కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దిప్కే డిమాండ్

ఢిల్లి : నీట్- యూజీ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కోరారు. ముఖ్యంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. 'భారతీయ రైల్వేపై నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అదే స్థాయిలో నిలబెట్టుకుంటే మరింత సంతోషిస్తాను' అంటూ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ నుంచి లద్దాఖ్ తిరుగు ప్రయాణంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన ఆయన, తన అనుభవాన్ని పంచుకున్నారు. లద్దాఖ్ కు వెళ్లే మార్గంలో ఢిల్లీ- శ్రీనగర్ వందే భారత్‌లో ప్రయాణించిన వాంగ్‌చుక్, చినాబ్ రైల్వే వంతెనపై ప్రయాణం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. "రైలు ప్రయాణం నాకు ఎప్పటినుంచో ఇష్టమైనది. ఆ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా అనిపించింది. భారతీయ రైల్వే సాధించిన అభివృద్ధి నిజంగా ప్రశంసనీయం" అని ఆయన వీడియో సందేశంలో తెలిపారు. "యువతతో నమ్మకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఏ ప్రభుత్వానికైనా చాలా ముఖ్యం. విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోవాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది"

### సోనమ్ వాంగ్ చుక్

కాగా, పార్లమెంట్‌లో ప్రజా పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు. ఈ బిల్లు కేవలం పరీక్షల



వ్యవస్థలోనే కాకుండా దేశ విద్యా వ్యవస్థలోనూ సమగ్ర మార్పులకు దారితీయాలని ఆకాంక్షించారు. గత నెలలో నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన 36 రోజుల ఉద్యమానికి సోనం వాంగ్‌చుక్ మద్దతు తెలిపారు. జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేపట్టగా, ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేంద్రం ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో ఆయన తన దీక్షను విరమించారు.

### అమిత్ షా రాజీనామాకు దిప్కే డిమాండ్

అదే సమయంలో సీజేపీ ఫౌండర్ అభిజీత్ దిప్కే మరోసారి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జూలై 20న నిర్వహించిన సంసద్ చలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని ఆరోపించారు. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "విద్యార్థులపై బలప్రయోగానికి ఆదేశాలు అమిత్ షా నుంచే వచ్చి ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ఇప్పుడు కేవలం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాదు. దేశ ప్రజలందరూ కలిసి రావాల్సిన అవసరం ఉంది" అని మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ దిప్కే అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. అలాగే కొత్త విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషిపై కూడా విమర్శలు చేశారు. యోగ గురువు బాబా రామ్‌దేవ్ చేసిన వ్యాఖ్యలపైనా దిప్కే స్పందించారు. జంతర్‌మంతర్ ఉద్యమం భారతీయ సంస్కృతిని దెబ్బతీసిందన్న రామ్‌దేవ్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. "మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్ చిత్రాలతో రాజ్యాంగబద్ధంగా ఉద్యమించడం సంస్కృతిని అవమానించడం ఎలా అవుతుంది? యువత దేశాన్ని, సంస్కృతిని చక్కగా ముందుకు తీసుకెళ్లగలదు" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, ఢిల్లీ పోలీసులు నిరసనల సమయంలో రాళ్లతో నిండిన ట్రక్కులను ఉద్యమ ప్రాంతానికి తీసుకొచ్చారని కూడా దిప్కే ఆరోపించారు. విద్యార్థులే రాళ్ల దాడికి పాల్పడ్డారని చూపించేందుకు ఇది ముందస్తు ప్రణాళికలో భాగమని ఆయన అన్నారు. ఈ విషయాన్ని తాను సంబంధిత డీసీపీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయితే, పోలీసులు మాత్రం అవి నిర్మాణ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలని వివరణ ఇచ్చినట్లు తెలిపారు. రైతుల ఉద్యమాలకు కూడా అవసరమైతే సీజేపీ మద్దతు ఉంటుందని దిప్కే స్పష్టం చేశారు. "మాలో చాలా మంది రైతు కుటుంబాలకు చెందినవారే. రైతుల పిల్లల భవిష్యత్తు కోసం కూడా మేం నిలబడతాం" అని చెప్పారు.

### ఢిల్లీ పోలీసుల ఉత్తర్వులు

అదే సమయంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. సీజేపీ నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోరని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు 13 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, అరెస్టయిన లేదా అదుపులోకి తీసుకున్న వారిని త్వరగా విడుదల చేస్తారని తెలిపింది. నేర చరిత్ర ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని మాత్రం స్పష్టం చేసింది.

## బిహార్ స్టైల్' జెన్జ్ నిరసన- బారికేడ్ల చోరీ- పోలీసులతోనే టగ్ అఫ్ వార్



వినూత్నంగా బిహార్‌లో జెన్ జెడ్ ఆందోళనలు- చాలా ఫన్నీ ఘటనలు- పోలీసులు, విద్యార్థుల మధ్య టగ్ ఆఫ్ వార్- అణుబాంబు కావాలన్న నిరసనకారుడు

ఢిల్లి : నీట్ పేపర్ లీకేజ్ , విద్యా వ్యవస్థలోని లోపాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవలే దేశ రాజధాని ఢిల్లీ జెన్ జెడ్ నిరసనలతో అట్టుడికిపోయింది. సీజేపీ, నిరుద్యోగ యువత ధర్నాలు, ఆందోళనలు, నిరసన ప్రదర్శనలతో హోరెత్తించారు. ఈ క్రమంలో నిరసనకారులపై లాఠీచార్జ్ చేయగా పలువురు గాయపడ్డారు. అలాగే చెదురుమదురు హింసాత్మక ఘటనలు సైతం జరిగాయి. అయితే బిహార్‌లో జెన్ జెడ్ చేసిన నిరసనలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నిరసన ప్రదర్శనల కొన్ని వీడియో క్లిప్‌లు ఫన్నీగా ఉండడంతో నెటిజన్లకు నవ్వు తెప్పిస్తున్నాయి. ప్రశ్నాపత్రాల లీకేజీని వ్యతిరేకిస్తూ జులై 22-25 మధ్య బిహార్ యువత రోడ్డెక్కింది. పట్నా సహా రాష్ట్రంలోని ఇతర నగరాల్లో ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే ఈ నిరసనల సమయంలో బిహార్ విద్యార్థులు చేసిన చేష్టలు అందరికి నవ్వు తెప్పిస్తున్నాయి. అందుకే ఈ ఆందోళనలను 'బిహార్ స్టైల్' జెన్ జెడ్ నిరసనగా పలువురు అభివర్ణిస్తున్నారు.

టియర్‌గ్యాస్ లవర్!

జులై 22న పట్నాలో నిరసనకారులపై బిహార్ పోలీసులు టియర్‌గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. అక్కడ ఉన్న విద్యార్థుల్లో ఒకరు టియర్‌గ్యాస్ రుచి చూశాడు. ఆ సమయంలో అతడు మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "అందరికీ నమస్కారం. నేను ఈరోజు ఒక తప్పు చేశాను. పోలీసులు మాపై టియర్‌గ్యాస్ ప్రయోగించారు. నేను దాని రుచి ఎప్పుడూ చూడలేదు. అందుకే ఆ పొగలోకి వెళ్లాను. అదొక చాలా శక్తివంతమైన పదార్థం మిత్రులారా. అందులో ఇథనాల్ సున్నా శాతం ఉంటుంది. చర్మం కూడా మండిపోతోంది. కళ్లు మండుతున్నాయి. నా ముక్కు నుంచి నీరు కారుతోంది" అని వీడియోలో చెప్పాడు. సారన్ జిల్లాలో యువకులు తమపై పోలీసులు ప్రయోగించిన టియర్‌గ్యాస్ షెల్స్‌ను ఏమాత్రం లెక్కచేయకుండా పట్టుకున్నారు. తిరిగి టియర్‌గ్యాస్ షెల్స్‌ను పోలీసులపైకే విసిరారు. దీంతో నిరసనకారులను ఎలా అదుపు చేయాలో పోలీసులకు అర్థంకాక సతమతమయ్యారు. ఛప్రా పట్టణం సహా ఇతర ప్రాంతాలలో ఆందోళనకారులు తమపైకి ప్రయోగించిన టియర్‌గ్యాస్ షెల్స్‌ను కర్రలతో బాదారు.

బారికేడ్ల దొంగతనం- రోలర్ స్కేట్లుగా మార్పు

తమ ప్రదర్శనను అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను చూసి విద్యార్థులు ఆగ్రహంతో ఊగిపోయారు. తమ గళాన్ని ఎవరూ అణచివేయలేరని ప్రతీకాత్మకంగా తెలియజేసేందుకు బారికేడ్లను ఎత్తిపట్టుకుని పారిపోయారు. అంతేకాకుండా వారిలో చాలామంది బారికేడ్లను రోలర్ స్కేట్లుగా, కిక్ స్కూటర్లుగా, రైడ్-ఆన్ బొమ్మలుగా మార్చారు.

వాటర్ కెనాన్- రెయిన్ డ్యాన్స్

పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని మండుటెండలో నిరసనకారులు ఆందోళన చేశారు. అయితే తీవ్రమైన ఎండ కారణంగా తమ డిమాండ్‌ను మరిచిపోయి భద్రతా సిబ్బందిని టియర్ గ్యాస్, వాటర్ కెనాన్‌ల కోసం ఏమైనా ఏర్పాట్లు చేశారా అని ప్రశ్నించారు. అప్పుడు పోలీసు అధికారులలో ఒకరు అవునని సమాధానం ఇచ్చారు. వాటర్ కెనాన్‌లను నిరసనకారులపై పోలీసులు ప్రయోగించగా స్టూడెంట్స్ రెయిన్ డ్యాన్స్ చేయడం చర్చనీయాంశమైంది.

## రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

మొదటి పేజి తరువాయి

బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, కొత్త చట్టం ప్రకారమే నీట్ ప్రశ్నపత్రం లీక్ ఈ కేసు విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించినట్లు చెప్పారు. దర్యాప్తు సంస్థ ఇప్పటికే ఛార్జ్‌షీటు కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చను రాజ్యసభలో ప్రారంభించిన మంత్రి జితేంద్రసింగ్ నీట్ పేపర్ లీక్‌పై దర్యాప్తు ఐదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై మంత్రి జితేంద్రసింగ్ విమర్శలు గుప్పించారు. ఆర్టికల్ 370 రద్దు, ఎన్టీఏ ఏర్పాటు ఆలస్యానికి కారణం ఎవరని ప్రతిపక్షాలను నిలదీశారు. 'ఇటీవలి కేసుకు సంబంధించి వెంటనే సీబీఐకి అప్పగించాం. మొన్న ఛార్జిషీట్ దాఖలు చేశాం. నిన్నటి నుంచి విచారణ ప్రారంభమైందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఈ కొత్త చట్టం ప్రకారం దర్యాప్తు 2 నెలల్లో పూర్తవుతుంది. ఆ తర్వాత మూడునెలల్లో విచారణ జరుగుతుంది. అంటే మొత్తం 5నెలల్లో ప్రక్రియ పూర్తవుతుంది. వారి నిబద్ధతగా ఉన్న ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి 70ఏళ్లు పట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తీసుకురాకుండా అడ్డుకోవడానికి 33ఏళ్లు తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లును తీసుకువస్తున్న తరుణంలో వారు చేస్తున్న గగ్గోలు బిల్లుకు వ్యతిరేకం కాదు. ఇకపై ప్రమాదంలో పడబోయే వారి స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న గగ్గోలు ఇది. 33ఏళ్లపాటు వారు చేయలేని పని ఇప్పుడు నెరవేరబోతోంది' ఖర్గే తెలిపారు.

### కుర్చీపోతుందనే భయంతోనే డిమాండ్లు అంగీకరించారు : ఖర్గే



కుర్చీపోతుందనే భయంతోనే కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లకు అంగీకరించిందని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం లేదన్నారు. రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ చట్టసవరణ బిల్లుపై మాట్లాడిన ఖర్గే, విద్యార్థులపై పెల్లెట్ గన్ల వాడకానికి కేంద్ర హోంశాఖ మంత్రిదే బాధ్యత అని, ఇప్పుడు ఆయన దాక్కున్నారని ఎద్దేవా చేశారు. ఒకరోజు ఆయన్ను బయటకు లాగి ప్రజల ముందు నిలబెడ్తామని ఖర్గే తేల్చిచెప్పారు. "రాజ్యసభలో ప్రతిపక్ష నేత పరీక్షా వ్యవస్థలోని వైఫల్యాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత తమ గళాన్ని తీవ్రంగా వినిపించారు. విద్యార్థుల ఆవేదనను ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంటు వరకు ప్రతిధ్వనించేలా చేశాయి. అంతకంతకూ పెరుగుతున్న ప్రజా ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వం మోకరిల్లాల్సి వచ్చింది. పోరాటం ఫలించి, ప్రభుత్వం మెడలు వంచేలా చేసిన దేశ యువతకు, విద్యార్థులకు నా హృదయపూర్వక అభినందనలు. యువత శక్తికి భయపడి ప్రధానమంత్రి కేంద్ర మంత్రి ప్రధాన్‌ను తొలగించక తప్పలేదు. పరిస్థితిని మరింత సాగదీస్తే తమ కుర్చీకే ముప్పు వస్తుందని ప్రభుత్వానికి అర్థమైంది. ఆ భయంతోనే ప్రభుత్వం దిగివచ్చి యువత డిమాండ్లను అంగీకరించింది. అయితే, ఈ నిర్ణయం వెనుక విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలనే చిత్తశుద్ధి కాదు. కేవలం తమ పదవిని కాపాడుకోవాలన్న స్వార్థం మాత్రమే దాగి ఉంది"

### మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ ప్రతిపక్ష నేత

### వర్సిటీల్లో ఆర్ ఎస్ ఎస్ వాళ్లనే తీసుకుంటున్నారు : ఖర్గే

పరీక్షలు, ఉద్యోగుల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఖర్గే అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వర్సిటీల్లో వీసీలు, ప్రొఫెసర్లలో ఆర్ఎస్ఎస్ వాళ్లనే తీసుకుంటున్నారని, అర్హతలు లేకుండానే వారిని నియమిస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో వీసీలు, బోధకులుగా సమర్థులనే నియమించాలని చెప్పారు. విద్యా వ్యవస్థలో మను స్మృతిని, ఆర్ఎస్ఎస్ సిలబస్‌ను పెడుతున్నారని ఆరోపించారు. వేద పాఠశాలల్లో చదివే బడుగు వర్గాలను వేధిస్తున్నారని అన్నారు.

### ఖర్గే వ్యాఖ్యలపై ఎన్‌డీఏ ఎంపీలు నిరసన

మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ఎన్ డీఏ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ, సిలబస్‌పై ఖర్గే చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ, మను స్మృతిపై ఖర్గే వ్యాఖ్యలతో సమాజంలో అశాంతి నెలకొంటుందని అన్నారు. ఇలాంటి విషయాలు సభలో ప్రస్తావించడం సరికాదని తెలిపారు. ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని చెప్పారు.

## రెండు రోజుల ముందే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**పాయకరావుపేట బృందావన కాలనీలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేత**



**పాయకరావుపేట, జూలై 30 ప్రజా న్యూస్ నెట్వర్క్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న ఉత్తరాంధ్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో, అదే రోజు పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రెండు రోజుల ముందుగానే లబ్ధిదారులకు అందజేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు గురువారం పాయకరావుపేట బృందావన కాలనీలోని 70, 71, 72 బూత్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు.పేదల సేవలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, జనసేన నాయకుడు తోట నాగేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లపల్లి నాగు, పట్టణ ఉపాధ్యక్షుడు చిరుకూరి పేర్రాజు, కార్యదర్శి మంజులూరి దుర్గాప్రసాద్, ఐటీడీపీ నాయకుడు బోలిశెట్టి నాగేశ్వరరావు, ఇంజరపు సూరిబాబు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.

## మండల ప్రజలకు చేరువైన హోమియో వైద్య సేవలు



**అనంతసాగరం జూలై 30 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న ప్రభుత్వ హోమియో ఆసుపత్రికి హోమియో వైద్యురాలిగా డాక్టర్ పి. స్రవంతి బాధ్యతలు స్వీకరించారు. దీంతో మండల ప్రజలకు హోమియో వైద్య సేవలు మరింత చేరువయ్యాయి.ఈ సందర్భంగా డాక్టర్ పి. స్రవంతి మాట్లాడుతూ గతంలో మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలో ఆర్‌బీఎస్‌కే =దీూఖ విభాగంలో వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అనంతసాగరం హోమియో ఆసుపత్రి ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రజలు హోమియో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.అంతేకాకుండా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచిత హోమియో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఎన్నో రోజులుగా ఖాళీగా ఉన్న హోమియో వైద్యురాలి పోస్టు భర్తీ కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగానే హోమియో వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## కార్యాలయాల సముదాయంలో మరుగుదొడ్లు కరువు ప్రజలకు తప్పని ఇబ్బందులు



**అనంతసాగరం జూలై 30 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** అనంతసాగరం మండల కేంద్రంలోని ఒకేచోట ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, విద్యాశాఖ, హౌసింగ్, వెలుగు తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో ప్రతిరోజూ ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అయితే కార్యాలయాల సముదాయంలో ప్రజల కోసం అందుబాటులో మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం ప్రజలకు కనీస సౌకర్యమైన మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీంతో ప్రస్తుతం బహిరంగ ప్రదేశాలనే మరుగుదొడ్లుగా ఉపయోగించాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కార్యాలయాల సముదాయంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా శాశ్వత మరుగుదొడ్లను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.


## పెళ్లేరు గ్రామ పంచాయతీ పుల్లనీళ్లపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహణ



**చేజర్ల,జూలై 30 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** మన ప్రియతమ నాయకులు రాష్ట్ర దేవాదాయ. ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారి ఆదేశాలతో. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు గారి సూచనలతో ఈ రోజు చేజర్ల మండలంలోని పెళ్లేరు గ్రామ పంచాయతీ పుల్లనీళ్లపల్లి గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం టీడీపీ బిజెపి జనసేన ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం,అభివృద్ధి ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలకు వివరించి వారి సలహాలు.సూచనలు తీసుకుని మెరుగైన పాలన అందించటానికి ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కొమ్మి సిద్ధుల నాయుడు బూత్ లెవల్ ఏజెంట్ తలపనేని రాధ కృష్ణయ్య. పైడి సుల్తానయ్య. అయితా హరి బాబు.మాగంటి అంకయ్య చౌదరి కల్వకూరి శ్రీనివాసులు నాయుడు కాకాణి రమణయ్య.డొంకల ప్రసాద్ నాయుడు.తెలుగుదేశం పార్టీ అభిమానులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం' డబ్బుల విషయంలో దంపతుల నడుమ మధ్య ఘర్షణ

**బ్లేడ్‌తో గొంతు కోసుకుని భర్త ఆత్మహత్యాయత్నం**



**పల్నాడు జిల్లా ...జూలై 30.. ప్రజా న్యూస్ నెట్ వర్క్ :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే 'తల్లికి వందనం' పథకం నగదు విషయంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం ఒకరి ప్రాణాల మీదికి తెచ్చింది. డబ్బుల కోసం భర్త ఒత్తిడి చేయగా, భార్య నిరాకరించడంతో ఆవేశానికి లోనైన భర్త బ్లేడ్‌తో గొంతు కోసుకుని తీవ్రంగా గాయపడిన ఘటన రాజుపాలెం మండలం చోటుచేసుకుంది..వివరాలలోకి వెళ్తే గణపవరం గ్రామానికి చెందిన సాంబయ్య, నాగలక్ష్మి దంపతుల మధ్య బుధవారం రాత్రి ప్రభుత్వం మంజూరు చేసిన 'తల్లికి వందనం' పథకం డబ్బుల విషయమై తీవ్రమైన వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ డబ్బులు తనకు ఇవ్వాలని భర్త సాంబయ్య భార్య నాగలక్ష్మిపై ఒత్తిడి తెచ్చాడు. అయితే ఆ నగదు ఇచ్చేందుకు నాగలక్ష్మి స్పష్టంగా నిరాకరించింది.దీంతో తీవ్ర ఆవేశానికి గురైన సాంబయ్య ఇంట్లోనే ఉన్న బ్లేడ్‌తో తన గొంతు కోసుకున్నాడు. తీవ్రంగా రక్తస్రావమై కిందపడిపోయిన అతడిని గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక పోలీసులు సమాచారం అందుకొని విచారణ చేపట్టారు...

## ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నరసరావుపేట శాఖను సందర్శించిన చైర్మన్ బోనబోయిన కౌశిక్ కృష్ణ



**పల్నాడు జిల్లా : 30జూలై .. ప్రజా న్యూస్ నెట్ వర్క్ :**

ది గుంటూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన కౌశిక్ కృష్ణ యాదవ్ బుధవారం నరసరావుపేట – ప్రకాష్ నగర్ లోని గుంటూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ శాఖకు సందర్శించారు. బ్యాంక్ కు నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత బోనబోయిన కౌశిక్ కృష్ణ మొదటిసారి నరసరావుపేటకు రావటం జరిగింది. ఈ సందర్బంగా బ్యాంకు మేనేజర్ కొండవీటి శ్రీనివాసరావు, చైర్మన్ బోనబోయిన కౌశిక్ కృష్ణ యాదవ్ ను స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. శాఖ అభివృద్ధికి సంబంధించిన, వ్యాపార లావాదేవీల గురించి చర్చించారు. 1947లో గుంటూరులో ఒక ఉత్పత్తి కొనుగోలుదారుల సంఘంగా రిజిస్టర్ చేయబడిన జిసియూ బ్యాంక్ దినదినాభివృద్ధి చెందుతూ, నేడు 23 శాఖలతో, రూ. 1200 కోట్ల వ్యాపార చేస్తూ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ .... ఎటువంటి ఐటీ రిటర్న్ లేకపోయినా 25 లక్షల రూపాయల వరకు గృహ రుణాలు పొందేందుకు సేవలు అందిస్తుందని చైర్మన్ కౌశిక్ కృష్ణ పేర్కొన్నారు. అలాగే, అతి తక్కువ సమయంలో బంగారంపై అత్యల్ప వడ్డీతో అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, ఎటువంటి డిపాజిట్ లేకుండానే .... అత్యాధునిక లాకర్ సదుపాయాన్ని ఇస్తున్నామని వివరించారు. అనంతరం బ్రాంచి అభివృద్ధి కోసం తమ ఖాతాదారుల నుంచి సూచనలను అడిగి తెలుసుకున్నారు.

## ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డా. చుక్క రత్న మన్మోహన్ నియామకం



**పల్నాడు జిల్లా ..జూలై 30.. ప్రజా న్యూస్ నెట్ వర్క్**

బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ చుక్క రత్న మన్మోహన్‌ను పల్నాడు జిల్లా ఇన్‌చార్జి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమిస్తూ ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నియామకంతో పల్నాడు జిల్లా వైద్య, ప్రజారోగ్య సేవల పర్యవేక్షణ బాధ్యతలను డా. చుక్క రత్న మన్మోహన్ స్వీకరించనున్నారు. జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాలు, టీకాల కార్యక్రమం, వైద్య సేవల సమన్వయం మరింత సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు చేపట్టనున్నట్లు వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

## ముందస్తుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**ఇందిరా కాలనీలో లబ్ధిదారులకు అందజేసిన పల్లా విలియం కేరి**



**పాయకరావుపేట, జూలై 30 ప్రజా న్యూస్ నెట్వర్క్:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 8న ఉత్తరాంధ్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ఆగస్టు 1న పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ముందస్తుగా గురువారం పంపిణీ చేశారు.పాయకరావుపేట పట్టణంలోని ఇందిరా కాలనీలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పెన్షన్లు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బోడపాటి శ్రీను, పేట ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎమ్మిలి దుర్గాప్రసాద్, ఐటీడీపీ సభ్యుడు కుంచె ప్రసాద్, బందుల కనకరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిని శిక్షించాలంటూ త్వరలోనే వినతి పాదయాత్ర చేస్తాం... వైఎస్ఆర్సిపి నాయకులు




**గుంటూరు... జూలై 30.. ప్రజా న్యూస్ నెట్ వర్క్ :** అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిపై వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలంటూ వినతి పాదయాత్ర చేపట్టనున్నట్లు వైఎస్ఆర్సిపి నాయకులు తెలిపారు.. అంబటి రాంబాబు నివాసంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసుకొని పాదయాత్ర పై విధి విధానాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు.. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో ఉండటంవల్ల పాదయాత్ర చేపట్టబోయే తేదీలను త్వరలో ప్రకటిస్తామని అన్నారు ఈ సందర్భంగా పల్నాడు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసంపై ఇటీవల జరిగిన దాడి, రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు నిదర్శనం అన్నారు, రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థ పై దాడి చేయడం నేరమని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. గుంటూరు ఎంపీ పెమ్మసాని, గుంటూరు2 ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త దగ్గరుండి దాడులు చేయించడం పద్ధతి కాదన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని ఆరోపించారు, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా పెట్టుకుని దాడులు చేస్తున్నారని అన్నారు.అంబటి రాంబాబు వంటి ప్రజాదరణ కలిగిన నాయకుడి ఇంటిపై దాడి చేయడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం, పోలీస్ వ్యవస్థ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది, ఈ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించకపోతే ప్రజల్లో మరింత ఆగ్రహం వస్తుందని హెచ్చరించారు..

## ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ కర్తవ్యం..!

**కోలగుట్లలో కదంతొక్కిన అభిమానం..!ఇంటింటికీ ప్రచారంలో బ్రహ్మారెడ్డికి బ్రహ్మరథం..!**




**పల్నాడు జిల్లా... జూలై 30.. ప్రజా న్యూస్ నెట్ వర్క్ :**

అన్నివర్గాల ప్రజల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. గురువారం దుర్గి మండల పరిధిలో కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు, నెహ్రూనగర్ తండా గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం.. ప్రతి ఇంటికి జూలకంటి ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కు ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. అనంతరం స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్, పార్టీ సీనియర్ నాయకులు తక్కెలపాటి రామకోటయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికి కూటమి ప్రభుత్వం లో అందించిన సంక్షేమాన్ని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో సాధించిన సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు స్థానికంగా ఏ సమస్యఉన్న నేతల దృష్టికి తీసుకొస్తే., దానిని తక్షణమే పరిష్కరించి, ఇబ్బందులు తొలిగేలా చర్యలు తీసుకుంటనని హామీ ఇచ్చారు. అనంతరం కంచరగుంట గ్రామంలో రూ. 36 లక్షల నిధులతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి, అక్కడున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి శంకర్,దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ లింగా బ్రహ్మయ్య, మండల పార్టీ అధ్యక్షులు జానకిరామయ్య, పార్టీ సీనియర్ నాయకులు లింగ రమేష్, గరిణే రమేష్, తక్కెలపాటి హనుమంతరావు, సింగు నాగేశ్వరరావు, భీమనబోయిన నాగేశ్వరరావు, పొన్నూరు ఆదం,దేవబిక్షం, కృష్ణ, కోటేశ్వరరావు, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు

## పిచ్చుకల సంరక్షణకు విద్యార్థుల ప్రతిజ్ఞ

**శ్రీప్రకాశ్ పాఠశాలలో హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమం**





**తుని, జూలై 30 ప్రజా న్యూస్ నెట్వర్క్:** హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తునిలోని శ్రీప్రకాశ్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. "ఇంటింటా వరికుంచెలు వేలాడదీద్దాం-- పిచ్చుకలను రక్షించుకుందాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం-- జీవవైవిధ్యాన్ని సంరక్షించుకుందాం" అనే అంశాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పిచ్చుకల సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రకృతిని సంరక్షించడం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడవచ్చని, ప్రతి ఇంటి వద్ద పిచ్చుకల కోసం వరికుంచెలు ఏర్పాటు చేయాలని సూచించారు.కార్యక్రమంలో హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి. దాలినాయుడు, గుడివాడ అప్పలనాయుడు, శేషగిరి, గ్రామీణ వైద్యుడు యండపల్లి నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రీప్రకాశ్ పాఠశాల ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డీ నీదీ ఒక బ్రతుకేనా నీది అసలు మనిషి జన్మమేనా కాకాణి



**నెల్లూరు జూలై 30 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, వ్యక్తిగత విమర్శలు మానుకుని వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని సోమిరెడ్డికి సూచించారు.ముత్తుకూరు బల్కర్లు, రామాయపట్నం పోర్టు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, ఇసుక యార్డుల అంశాల్లో సోమిరెడ్డి అవకతవకలకు పాల్పడ్డారని కాకాణి ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, తన వ్యాఖ్యల్లో సంయమనం పాటించాలని హితవు పలికారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే తమకు బలమని పేర్కొన్న కాకాణి, రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగితే తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు.

## ఇంటింటికీ కూటమి... ప్రజలతో మమేకమైన దివ్య

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన... వార్డుల సమస్యలపై ఆరా**



**తుని, జూలై 30 ప్రజా న్యూస్ నెట్వర్క్:** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజాహితం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ యనమల దివ్య పేర్కొన్నారు. "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" నినాదంతో తుని నియోజకవర్గంలో కొనసాగుతున్న ఇంటింటికీ కూటమి కార్యక్రమంలో భాగంగా గురువారం తుని పట్టణంలోని 15, 27వ వార్డుల్లో ఆమె పర్యటించారు.కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన యనమల దివ్య గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అదే సమయంలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గతంలో ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేశానని ఆమె పేర్కొన్నారు. ఆమెకు స్థానికులు ఆత్మీయ స్వాగతం పలుకుతూ మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, సీనియర్ నాయకుడు యనమల రాజేష్ హాజరయ్యారు. జిల్లా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్, మోతుకూరి వెంకటేష్, కుక్కడపు బాలాజీ, పరవాడ తాతబాబు, చందక గురుమూర్తి తదితరులు యనమల దివ్యకు స్వాగతం పలికారు.అంతకుముందు కొత్తపేట వినాయక ఆలయాన్ని సందర్శించిన యనమల దివ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డుల్లో పర్యటిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానికులతో చర్చించారు.

## గంజాయి కేసులో తప్పించుకొని తిరుగుతున్న నిందితుడి అరెస్టు




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి , జూలై 30 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** గంజాయి క్రయవిక్రయాల కేసులో నిందితుడిగా ఉండి, కేసు నమోదు అయిన విషయం తెలుసుకున్న అనంతరం కొంతకాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న బీరెల్లి ప్రదీప్ రెడ్డి అలియాస్ సన్నీని హుజూర్‌నగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన బీరెల్లి ప్రదీప్ రెడ్డి అలియాస్ సన్నీ ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు వివరాల్లోకి వెళితే, గత నెల జూన్ 9న హుజూర్‌నగర్ శివారులోని పరకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట కొందరు వ్యక్తులు గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్నట్లు హుజూర్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించగా కొప్పుల శ్రీకాంత్ అలియాస్ పండు, కాసాని సాయి కృష్ణ, దూరు సందీప్, డేరంగుల వాసు, గంగాధరి అభిరామ్ అలియాస్ అభి, సాతి అరవింద్ సింగ్ అనే ఆరుగురు వ్యక్తులు గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి అదే రోజు అరెస్టు చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న బీరెల్లి ప్రదీప్ రెడ్డి అలియాస్ సన్నీ తనపై కేసు నమోదు అయిన విషయం తెలుసుకుని పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్నట్లు గుర్తించారు. నిందితుడి కదలికలపై హుజూర్‌నగర్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అతడి ఆచూకీ కోసం వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసుకు సంబంధించిన వివరాలను పరిశీలించి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హుజూర్‌నగర్ రూరల్ ఎస్ఐ హనుమాన్ నాయక్, పోలీసు సిబ్బంది సి. ఎచ్ . నరేశ్, బి. వెంకటేష్‌లను హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు ప్రత్యేకంగా అభినందించారు.


## ఎత్తిపోతల పథకాల దొంగతనాల నివారణకు రైతుల అవగాహన సదస్సు పోలీసు అధికారుల సమన్వయంతో పథకాల రక్షణకు ప్రత్యేక చర్యలు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి , జూలై 30 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**

హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 35 ఎత్తిపోతల పథకాల వద్ద జరుగుతున్న దొంగతనాలను నివారించడం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ప్రత్యేక రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన మోటార్లు, విద్యుత్ పరికరాలు, పైపులు, ఇతర సామగ్రి దొంగతనాలకు గురికాకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎత్తిపోతల పథకాలు రైతులకు సాగునీరు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి రక్షణ బాధ్యత అధికారులు, రైతులు, స్థానిక ప్రజలు సమిష్టిగా తీసుకోవాలని పేర్కొన్నారు. దొంగతనాల వల్ల ఎత్తిపోతల పథకాల నిర్వహణకు ఆటంకం ఏర్పడి రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల పథకాల పరిసరాల్లో నిఘా పెంచడంతో పాటు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులు సూచించారు. పోలీసు, రెవెన్యూ, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎత్తిపోతల పథకాల వద్ద దొంగతనాలను అరికట్టేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, రైతులు కూడా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సదస్సులో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 61వ వార్డు ఇంటింటా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జనసేన నేత దుంగ దేవన్ రాజు



**ప్రజా న్యూస్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీఎం నాయుడు :**

పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియోజకవర్గ జీవీఎంసీ 61వ వార్డు లో నెలవారీ ఇంటింటా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆంధ్రప్రదేశ్ , శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం (జింక్) ఆలయ ధర్మకర్త మరియు జనసేన పార్టీ 61వ వార్డు అధ్యక్షులు దుంగ దేవన్ రాజు మరియు సచివాలయం సిబ్బంది చేతుల మీదగా అర్హులకు పెన్షన్లు అందజేశారు, పెన్షన్ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఆనందం వ్యక్తం చేశారు, దేవన్ రాజు మాట్లాడుతూ.. పెన్షన్ వృధా చేయకుండా అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు, ఉత్తరాంధ్ర మణిహారం అల్లూరి సీతారామరాజు రాజు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ భోగాపురం ఆగష్టు ఒకటో తారీఖున భారత్ ప్రధాని ప్రధానమంత్రి మోడీ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించి జాతికి అంకితం చేస్తారు, ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి శుభ సూచకం అన్నారు, స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్ళి పెన్షన్ పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం అభివృధిని వివరించారు, ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది కెవిఎస్ సత్యనారాయణ , నాగలక్ష్మి , టీడిపి, బిజెపి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో 'సర్' కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి , జూలై 30 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'సర్' కార్యక్రమం పురోగతి, క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలు, సంబంధిత బాధ్యుల పనితీరుపై కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సర్' కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలు, ప్రజలకు అవగాహన కల్పించే విధానాలపై సమగ్రంగా చర్చించారు.ప్రజలకు చేరువగా ఉంటూ ప్రతి అంశాన్ని బాధ్యతాయుతంగా పర్యవేక్షించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో కార్యక్రమ పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని 'సర్' కార్యక్రమం అమలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

### ఐదు మండలాల ప్రజల భద్రత కోసం అఖిలపక్షం డిమాండ్



సూర్యాపేట జిల్లా ప్రతినిధి , జూలై 30 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకులు గురువారం డిప్యూటీ తహశీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ, నియోజకవర్గానికి కేంద్ర బిందువుగా ఉన్న తుంగతుర్తిలో నూతనంగా మంజూరైన అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యవసర సమయాల్లో సకాలంలో సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్ మండలాలకు అగ్నిమాపక సేవలు మరింత వేగంగా అందుతాయని, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు దూర ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చే వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు, వ్యవసాయ పంటలకు నష్టం, ఇళ్లలో జరిగే ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం తుంగతుర్తిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక దృష్టి సారించి, తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల భద్రత, ఐదు మండలాల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని నూతనంగా మంజూరైన ఫైర్ స్టేషన్‌ను తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించి త్వరగా నిర్ణయం తీసుకోకపోతే అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణను ప్రకటించి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తడకమల్ల రవికుమార్, ఉప్పుల రాంబాబు, కొండ రాజు, గునిగంటి సంతోష్, బొంకూర్ మల్లేష్, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, తడకమల్ల మల్లికార్జున్, బొంకూరి మధు, బొంకూరి వెంకటేష్, తడకమల్ల అనిల్, బొంకూరి సాయి, తడకమల్ల మధు, కాసర్ల రాజశేఖర్, కొండ మధు, కాసర్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం





**పల్నాడు జిల్లా:జూలై 30.. ప్రజా న్యూస్ నెట్ వర్క్**

సత్తెనపల్లి రూరల్ మండలం నందిగామ గ్రామంలో నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా నందిగామ గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.తర్వాత విద్యార్థులు, విద్యార్థినీలతో మాట్లాడిన ఎమ్మెల్యే 'తల్లికి వందనం' పథకం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పథకం ద్వారా విద్యార్థుల కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గర్వంగా ప్రజలకు వివరించగలుగుతున్నామనికూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.




# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ మారాలి

### ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది

- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక






**పుణె, జూలై 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని పాలించడం కంటే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా బాగా పనిచేస్తారని, అందువల్ల ప్రధాని పదవికి రాజీనామా చేసి ఆ బాధ్యతను మరొకరికి అప్పగించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం తొలిసారి మహారాష్ట్రలోని తన స్వస్థలానికి చేరుకున్న అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీలో ఆందోళనలు ముగిసిన తర్వాత వివిధ రాష్ట్రాల్లో విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ చర్యలను నిలిపివేయాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో యువత తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల ఆగ్రహం తగ్గలేదని, వారి అసంతృప్తి ఒక్క మంత్రిపైనే కాకుండా కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువత భావోద్వేగాలను బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని విమర్శించారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. "విద్యార్థులు ఉగ్రవాదులు కాదు.. దేశ భవిష్యత్తు. వారి స్వరాన్ని అణచివేస్తే అవసరమైతే ప్రభుత్వాన్నే మార్చే స్థాయిలో ఉద్యమం చేపడతాం" అని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జరిగిన నిరసన సందర్భంగా విద్యార్థులపై పెల్లెట్ గన్ వినియోగించారన్న ఆరోపణలపై స్పందించిన ఆయన, ఇందుకు బాధ్యులెవ్వరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. 36 రోజులపాటు ఎండవానలను లెక్కచేయకుండా పోరాడిన కార్యకర్తలు విజయాన్ని జరుపుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో సన్మానించడం సిగ్గుచేటని అభిజీత్ విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న నేపథ్యంలో అలాంటి సన్మానం ద్వారా బీజేపీ ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని ఆరోపించిన ఆయన, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల గురించి ప్రధాని ప్రకటించినప్పటికీ తొలి విచారణకే సీబీఐ తరపు న్యాయవాది హాజరుకాకపోవడం ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేస్తోందన్నారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, తాను సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే స్పందిస్తానని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు.

# సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

### ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పీఐబీ

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన




**న్యూఢిల్లీ, జూలై 30:** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

## విధి నిర్వహణలో భయానికి తావు లేదు

### నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి

### సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర



**న్యూఢిల్లీ, జూలై 30:** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్‌ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్‌ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

### చైనా తీరుపై ట్రంప్ అసహనం



**వాషింగ్టన్, జూలై 30:** అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్‌÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

# మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

### సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ



**న్యూఢిల్లీ, జూలై 30:** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగంపై వివాదం నడుస్తోంది. దీనిపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జనసమూహాన్ని నియంత్రించే సమయంలో పోలీసుల బలప్రయోగం ఎలా ఉండాలనే అంశంపై అమలులో ఉన్న గ్రేడెడ్ యూజ్ ఆఫ్ ఫోర్స్ స్టాండింగ్ ఆర్డర్‌ను కోర్టు ముందు సమర్పించాలని ఆదేశించింది. వాడటానికి స్పష్టమైన రూల్స్ ఉండాలని జస్టిస్ బాశ్చి వ్యాఖ్యానించారు. అదే సమయంలో పెల్లెట్ గన్స్‌నూ పూర్తిగా నిషేధించలేమని చెప్పింది. మరోవైపు పిటిసనర్ల తరుపుణ న్యాయవాది వాదిస్తూ.. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల్లో నిరసనల సమయంలో మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అలాంటి ఆయుధాలు వాడకంపై పోలీసుల చర్యలపై విచారణ కోరారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, క్రౌడ్ కంట్రోల్‌లో బలప్రయోగానికి సంబంధించిన అధికారికి స్టాండింగ్ ఆర్డర్‌ను రికార్డ్‌లో ఉంచాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడే అధికారం పోలీసులకు ఉందని చెప్పింది. ఇదే సమయంలో పోలీసులు వాడిన మందుగుండు సామాగ్రికి సంబంధించిన వివరాలు భద్రపరచాలని ఆదేశించింది. పెల్లెట్ గన్స్ కాల్పుల్లో గాయపడిన వారికి పూర్తి న్యాయ సహాయం అందించాలని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణలో ఢిల్లీ పోలీసులు సమర్పించే స్టాండింగ్ ఆర్డర్, పెల్లెట్ గన్ వినియోగంపై కోర్టు చేపట్టే పరిశీలన కీలకంగా మారే అవకాశం ఉంది.